# ప్రపంచ యువ, వృద్ధ జనాభాల మధ్య సమతుల్యత సాధించగలమా.. !

## (తాజాగా విడుదలైన "ప్రపంచ జనాభా అవకాశాలు - 2024" ఆధారంగా)

28వ ఐరాస జనాభా అవకాశాలు - 2024 (వరల్డ్ పాప్యులేషన్ ప్రాస్పెక్ట్స్-2024) తాజా అధ్యయనాల ప్రకారం రానున్న 50 నుంచి 60 ఏండ్లలో, నేటి ప్రపంచ జనాభా 8.2 బిలియన్ల నుంచి 10.3 బిలియన్ల వరకు పెరగవచ్చని, తర్వాత కాలంలో శతాబ్ద చివరికి తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ శతాబ్ద చివరి వరకు నేటి జనాభా మరో 2 బిలియన్లు లేదా 200 కోట్లు పెరుగుతుందనే అధ్యయన విశేషాలను వెల్లడించింది. ప్రపంచవ్యాప్త 237 దేశాలు లేదా ప్రాంతాల జనాభాలో 28 శాతం వరకు 63 దేశాల్లోనే రికార్డు అవుతుందని, మరో 10 శాతం జనాభా 48 దేశాల్లో ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

### సంతానోత్పత్తి రేటు పడిపోవడం:

నేడు యూఎస్, యూరోప్, ఆసియా దేశాల్లో ప్రతి మహిళకు సంతానోత్పత్తి రేటు 2 వరకు తగ్గడం గమనించారు. గత ఆరు దశాబ్దాల్లో సంతానోత్పత్తి రేటు 5 నుంచి 2 వరకు క్షీణించడం నమోదు అయ్యింది. 1990లో ప్రకటితమైన ఒక్కొక్క మహిళకు 3.3 శిశువులు ఉండగా, నేడు అది 2.3 వరకు పడిపోవడం గమనించారు. ప్రపంచవ్యాప్తంగా 18-ఏళ్ల లోపు మహిళల ప్రసవాలతో 4.7 మిలియన్ల శిశువులు (3.5 శాతం) జన్మిస్తున్నారని, ఇందులో 3.4 లక్షల శిశువులు 15 ఏండ్ల లోపు తల్లులకు పుడుతున్నారని, దీని వల్ల మాత శిశువులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలుస్తున్నది. ఒక్కొక్క మహిళకు సంతాన రేటు 2.1 వరకు చేరినట్లు విశ్లేషిస్తున్నారు. ఈ సమస్యలను అధిగమించడానికి మహిళలకు విద్య, సరైన వయస్సులో వివాహాలు, మహిళా ఆరోగ్య పరిరక్షణలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రపంచ దేశాలకు సూచనలు చేస్తున్నది.

### పెరుగుతున్న సగటు ఆయుర్దాయం:

కోవిడ్-19 విపత్తు అనంతరం విశ్వ మానవుడి సగటు అయుర్దాయం మరో సారి క్రమంగా పెరుగుతున్నదని, 1995 నుంచి నేటికి సగటు ఆయుర్దాయం 8.4 సంవత్సరాలు పెరిగి 73.3 ఏండ్లు చేరడం గమనించారు. 2054 వరకు సగటు ఆయుర్దాయం 77.4 ఏండ్లు పెరగవచ్చని స్పష్టం చేస్తున్నారు. నేడు 15-49 ఏండ్ల వయస్సున్న మహిళల జనాభా 2 బిలియన్లు ఉండగా, 2050 నాటికి అది 2.2 బిలియన్లకు పెరగవచ్చని తెలుస్తున్నది. 2054 వరకు ప్రపంచ జనాభా 1.4 బిలియన్లు పెరగడానికి పెరిగిన మహిళల జీవన ప్రమాణాలు కారణం కావచ్చని తెలుస్తున్నది. ప్రపంచ 100 దేశాలు లేదా ప్రాంతాల్లో రానున్న 30 ఏండ్లల్లో వర్కింగ్-ఏజ్ జనాభా పెరుగుతూ ఆయా దేశాలకు జనాభా పెరుగుదల వరంగా మారుతుందని వివరిస్తున్నారు. జనాభా పెరుగుదలతో ప్రయోజనం పొందడానికి ఆయా దేశాలు విద్య, ఆరోగ్యం, మౌళిక వనరులు, ఉద్యోగ ఉపాధుల కల్పనలకు కృషి చేయాలని సలహా ఇస్తున్నారు.

### పిల్లల జనాభాను మించనున్న వృద్ధ జనాభా:

2080 వరకు 65 ఏండ్ల వృద్ధుల జనాభా కన్న 18 ఏండ్ల లోపు పిల్లల జనాభా తక్కువగా ఉంటుందని, ఈ స్థితి ఆయా దేశాలకు శాపంగా మారనుందని, 2030ల్లో 80 ఏండ్ల వృద్ధ జనాభాతో పోల్చితే ఏడాది లోపు శిశువుల జనాభా తగ్గనుందని హెచ్చరిస్తున్నారు. యువ జనాభా అధికంగా ఉండే దేశాలు యువతకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించడానికి, ఉద్యోగ ఉపాధుల మార్గాలు పెంచడానికి, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలకు అధికంగా కృషి చేయాలని సూచిస్తున్నారు. దాదాపు 50 వరకు దేశాలు లేదా ప్రాంతాల్లో విదేశీ వలసలతో జనాభా తగ్గడం జరుగుతుందని కూడా పేర్కొనబడింది. ఈ దేశాల్లో సంతానోత్పత్తి రేటు పడిపోవడం, వృద్ధ జనాభా పెరగడం కనిపిస్తుందని తెలుస్తున్నది.

### లింగ సమానత్వ సాధన:

లింగ అసమానతలు తగ్గించడానికి చట్టబద్దంగా వివాహ వయస్సును పెంచడం, వైద్య ఆరోగ్య వసతులు కల్పించడం, మహిళా విద్యకు పెద్ద పీట వేయడం, ఆర్థికంగా మహిళలను స్వతంత్రులుగా మార్చడం, పని కల్పించడం, యుక్త వయస్సు చేరిన తర్వాత పిల్లల్ని కనడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. జనాభా అధికంగా ఉన్న దేశాల్లో తల్లితండ్రులకు ప్రసూతి సెలవులు కల్పించడం, పని సమయాలను ఉద్యోగులకు అనుకూలంగా ఉంచడం, పిల్లల ఆరోగ్యానికి పట్టం కట్టడం, కనీస అవసరాలను అందించడం, వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం, ఆడ మగ సమానంగా పనిని పంచుకోవడం లాంటి చర్యలు మహిళాభివృద్ధికి, సమానత్వ సాధనకు, ప్రత్యక్షంగా దేశాభివృద్ధికి దోహదపడనున్నాయని పేర్కొంటున్నారు.

ప్రపంచ దేశాలు లేదా ప్రాంతాల జనాభా సమస్యలు విభిన్నంగా ఉన్నాయి. ఇండియా లాంటి దేశాల్లో యువ జనాభా అధికంగా ఉన్నది. ఇలాంటి దేశాలు యువశక్తిని నైపుణ్య నిధిగా మార్చుకుంటూ దేశాభివృద్ధికి బాటలు వేసుకోవాలి. మరి కొన్ని దేశాల్లో వృద్ధ జనాభా అధికంగా ఉన్నది. ఇలాంటి దేశాల్లో యువ జనాభా పెరుగుదలకు అనువైన పథకాలను అమలు చేస్తూ యువశక్తిని ఉత్పత్తి రంగంలో వినియోగించుకోవడానికి ప్రయత్నాలు చేసుకోవాలి. ఏ దేశానికైనా జనాభా ఒక ఉజ్వల భవితకు అపూర్వ వరం కావాలి, భారం/శాపం కారాదు.

- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ముంబాయిలో ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ ( ఐఎన్ ఎస్ ) టవర్స్ ను ప్రారంభించిన ప్రధాని

న్యూఢిల్లీ, జులై 15 :ముంబాయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లోని జి బ్లాక్ లోని భారతీయ వార్తాపత్రికల సంఘం కార్యాలయాన్ని సందర్శించిన ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఐఎన్ ఎస్ టవర్స్‌ను ప్రారంభించారు. నూతన భవనం ముంబాయిలో తగినంత స్థలంలో ఆధునిక కార్యాలయాన్ని కలిగివుందని ఇది ఐఎన్ ఎస్ సభ్యుల అవసరాలను తీరుస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ముంబాయిలోని వార్తాపత్రికల పరిశ్రమకు ఇది కీలకమైన కేంద్రంగా వుంటుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన నూతన టవర్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ వార్తాపత్రిక సంఘ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. నూతన కార్యాలయంనుంచి నిర్వహించే విధుల నిర్వహణవల్ల భారతదేశ ప్రజాస్వామ్య మరింత బలోపేతమవుతుందని ఆకాంక్షించారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే భారతీయ వార్తాపత్రిక సంఘం ఏర్పడిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని భారతదేశ ప్రయాణంలోని ఆటుపోట్లకు ఐఎన్ ఎస్ సాక్షిగా నిలిచిందని అన్నారు. అంతే కాకుండా ఆయా ఘటనలతో మమేకమవుతూ వాటిని వార్తల రూపంలో ప్రజలకు తెలియజేసిందని అన్నారు. ఒక సంస్థగా భారత వార్తాపత్రికల సంఘం చేసిన కృషి ప్రభావం దేశంలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

ఆయా దేశాల స్థితిగతులకు మీడియా అనేది ప్రేక్షకురాలు కాదని వాటిని మార్చడంలో కీలకపాత్ర పోషిస్తుందని ప్రధాని వివరించారు. రాబోయే పాతిక సంవత్సరాల్లో వికసిత భారత్ చేసే ప్రయాణంలో వార్తాపత్రికలు, మ్యాగజైన్ల పాత్రను ఆయన ప్రత్యేకంగా పేర్కొన్నారు. దేశ పౌరుల హక్కులు, వారి సామర్థ్యాలగురించి అవగాహనను కల్పించడంలో మీడియా పాత్రను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తమ శక్తియుక్తుల మీద నమ్మకమున్న పౌరులు గొప్ప విజయాన్ని సాధిస్తారనే దానికి భారతదేశంలో డిజిటల్ లావాదేవీల విజయమే ఉదాహరణగా నిలుస్తోందని అన్నారు. భారతదేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల వ్యవస్థ గురించి తెలుసుకోవడానికి ప్రపంచంలోని ప్రధాన దేశాలు ఆసక్తిని చూపుతున్నాయని ప్రధాని అన్నారు. ఈ విజయాల్లో మీడియా భాగస్వామ్యాన్ని ఆయన ప్రశంసించారు.

సీరియస్ అంశాలపై చర్చలు చేయడంద్వారా ఒక సంవాదాన్ని తయారు చేయడంలో మీడియా నిర్వర్తించే సహజ పాత్రను ప్రధాని ప్రస్తావించారు. మీడియా నిర్వహణపై ప్రభుత్వ విధానాల ప్రభావాన్ని ఆయన ప్రత్యేకంగానొక్కి చెప్పారు. జన్ ధన్ యోజన ఉద్యమంద్వారా నూతన బ్యాంకు అకౌంట్ల ప్రారంభంద్వారా బ్యాంకుల రంగంలోకి 50 కోట్ల మందిని తీసుకురావడమనేది ఆర్థికంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి ఉదాహరణగా నిలిచిందని ప్రధాని అన్నారు. డిజిటల్ ఇండియా సాధనకు, అవినీతిని అంతమొందించే కార్యక్రమాలకు ఈ ప్రాజెక్ట్ భారీగా సాయం చేసిందని అన్నారు. అలాగే తన ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్, స్టార్టప్ ఇండియా కార్యక్రమాలపై వోటుబ్యాంక్ రాజకీయాల ప్రభావం లేదని అన్నారు. జాతీయ సంవాదంలో ఈ ఉద్యమాలను భాగం చేసినందుకు మీడియా పాత్రను ఆయన ప్రశంసించారు.

భారత వార్తాపత్రికల సంఘం తీసుకునే నిర్ణయాలు దేశ మీడియాకు దిశానిర్దేశం చేస్తాయని ప్రధాని అన్నారు. దేశంలో మొదలుపెట్టే ఏ కార్యక్రమమైనా అది తప్పనిసరిగా ప్రభుత్వ కార్యక్రమం అయివుండాల్సిన పని లేదని, ఏ ఆలోచనైనా అది ప్రభుత్వానిదై వుండాలని లేదని అన్నారు. ఆజాదీకీ అమృత మహోత్సవ్, హర్ ఘర్ తిరంగాలాంటి ఉద్యమాలను ప్రభుత్వం ప్రారంభించిందని, మొత్తం దేశం వాటిని ముందుకు తీసుకెళ్లిందని ప్రధాని ఉదహరించారు. అదే విధంగా పర్యావరణ సంరక్షణకోసం ప్రభుత్వం కనబరుస్తున్న శ్రద్ధను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇది రాజకీయ అంశం కాదని, మానవీయ అంశమని చెబుతూ ఈ మధ్యనే ప్రారంభించిన ఏక్ పేడ్ మా కే నామ్ ఉద్యమాన్ని ఉదహరిస్తూ ప్రపంచవ్యాప్తంగా దాని గురించి మాట్లాడుకుంటున్నారని అన్నారు. తాను ఈ మధ్యనే పాల్గొన్న జి7 శిఖరాగ్ర సదస్సులో అంతర్జాతీయ నేతలు సైతం భారతదేశ ఉద్యమంపట్ల ఆసక్తిని కనబరచారని గుర్తు చేశారు. నేటి యువ తరాలకు మంచి భవిష్యత్తును అందించే కార్యక్రమంలో అన్ని మీడియా సంస్థలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేశంకోసం అలాంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని మీడియాను కోరారు. భారత రాజ్యాంగానికి 75 ఏళ్లవ్వడంతో నిర్వహిస్తున్న సంబరాలను ప్రస్తావిస్తూ రాజ్యాంగంపట్ల పౌరుల విధి, అవగాహనను పెంచడంలో మీడియా కీలకపాత్రను ప్రత్యేకంగా స్పష్టం చేశారు.

పర్యాటక రంగ అభివృద్ధికోసం అందరమూ సమిష్టిగా కృషి చేసి మంచి పేరును తేవాలని, ఈ రంగాన్ని అందరికి అందుబాటులోకి తెచ్చేలా మార్కెట్ చేయాలని ప్రధాని కోరారు. వార్తాపత్రికలు ఒక నెలను ఎంపిక చేసుకొని ఆ నెలలో ప్రత్యేకంగా ఒక రాష్ట్ర పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. దీనివల్ల రాష్ట్రాల మధ్యన ఒకదానిపట్ల మరొక రాష్ట్రానికి పరస్పర ఆసక్తి పెరుగుతుందని అన్నారు.

వార్తాపత్రికలు అంతర్జాతీయంగా తమకున్న ఉనికిని పెంచాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. సమీప భవిష్యత్తులో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగబోతున్నామని అందుకోసం దేశం చేస్తున్న కృషిని ప్రస్తావించిన ప్రధాని భారతదేశ విజయాన్ని ప్రపంచంలోని ప్రతి మూలకు తీసుకుపోయే బాధ్యత మీడియాదేనని అన్నారు. ఒక దేశానికి వుండే ప్రపంచ స్థాయి ఇమేజ్ నేరుగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందని ప్రధాని అన్నారు. భారతదేశ స్థాయి పెరుగుతున్న కొద్దీ ప్రవాస భారతీయులకు ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రపంచ ప్రగతికోసం వారిలో బలోపేతమవుతున్న సామర్థ్యాన్ని ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఐక్యరాజ్యసమితి గుర్తించిన అన్ని భాషల్లో భారతదేశ ప్రచురణ సంస్థలు వుండాలని ఆయన అభిలషించారు. ఈ ప్రచురణ సంస్థలు ప్రపంచ భాషల్లో తమ వెబ్ సైట్లను, మైక్రో సైట్లను, సోషల్ మీడియా సైట్లను నిర్వహించాలని ఇలాంటి పనుల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాయం తీసుకోవాలని సూచించారు.

మీడియా సంస్థలు తమ ప్రచురణలకోసం డిజిటల్ ఎడిషన్లను ఉపయోగించుకోవాలని ,ప్రింట్ ఎడిషన్లతో పోలిస్తే డిజిటల్ ఎడిషన్లలో స్థలానికి సంబంధించిన పరిమితులుండవని తాను ఈ రోజు ఇచ్చిన సలహాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. మీరందూ నా సలహాలను పరిగణలోకి తీసుకుంటారని భావిస్తున్నాను, కొత్త ప్రయోగాలు చేయండి, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి. మీరు ఎంత బలంగా పని చేస్తే దేశం అంత బలంగా ప్రగతి సాధిస్తుందని చెబుతూ ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

మహారాష్ట్ర గవర్నర్ శ్రీ రమేష్, ముఖ్యమంత్రి శ్రీ ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు శ్రీ దేవేంద్ర ఫడ్నవిస్, శ్రీ అజిత్ పవార్, భారత వార్తాపత్రికల సంఘం అధ్యక్షులు శ్రీ రాకేష్ శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాష్ట్ర సముద్రయాన, జలమార్గ రవాణా కమిటీ సమావేశానికి, జూలై 16న ఆతిథ్యం ఇవ్వనున్న కేంద్ర పోర్టులు, షిప్పింగ్ జలమార్గ మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, జులై 15 :కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గ మంత్రిత్వశాఖ 2024 జూలై 16 వ తేదీ ఉదయం 10గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా రాష్ట్ర సముద్రయాన, జలమార్గ రవాణా కమిటీ (ఎస్.ఎం.డబ్ల్యుటీసి) సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ సమావేశానికి కేంద్ర పోర్టులు, షిప్పింగ్ జలమార్గ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ టి.కె. రామచంద్రన్ అధ్యక్షత వహిస్తారు.

దేశవ్యాప్తంగా సముద్రయాన, జలమార్గ రవాణా రంగ సమగ్ర అభివృద్ధికి కృషి చేయడం ఈ కమిటీ లక్ష్యం. అలాగే మిగిలిన రాష్ట్రాలను కూడా తన కార్యకలాపాలను విస్తరించడం దీని లక్ష్యం. ఈ సమావేశం ప్రధానంగా ఆయా రాష్ట్రాలకు ప్రత్యేకమైన సముద్రయాన, జలమార్గాల రవాణా మాస్టర్ ప్లాన్ను సిద్ధంచేయడం,సముద్రయాన రంగంపై విధానాల రూపకల్పన, హరిత కార్యక్రమాలు, జలమార్గాల అభివృద్ధి, క్రూయిజ్ టూరిజం, నగర జలమార్గ రవాణా, లైట్ హౌస్ ల అభివృద్ధి వంటి వాటిపై దృష్టిపెడుతుంది.

జలమార్గ రవాణా రంగ నిర్వహణ, సమీకృత కార్యకలాపాల నిర్వహణకు ఏకీకృత విధానం అవసరాన్ని గుర్తిస్తూ ఈ మంత్రిత్వశాఖ ఎస్.ఎం.డబ్ల్యు.టీ.సి లను ఏర్పాటు చేసింది. ఆయా రాష్ట్రాలలో చేపట్టే వివిధ కార్యకలాపాలు, పథకాల అమలును సమన్వయం చేయడానికి దీనిని ఏర్పాటు చేశారు.

సముద్రయాన, జలమార్గ రంగంలో తగిన నాయకత్వం అందించడానికి, ఈ రంగంలో జరుగుతున్న కృషిని మరింత పటిష్టం చేయడానికి ఈ కమిటీలు కీలకంగా ఉండనున్నాయి. ప్రతి ఎస్.ఎం.డబ్ల్యు.టి.సి కి ఛీఫ్ సెక్రటరీ, లేదా అడిషన్ ఛీఫ్ సెక్రటరీ నాయకత్వం వహిస్తారు. వివిధ పోర్టులు, సముద్రయాన బోర్డులు, రాష్ట్ర పిడబ్ల్యుడి, అంతర్గత జలమార్గాలు, పర్యాటక అభివృద్ధి, ఫిషరీస్ విభాగం, రైల్వేలు, జాతీయ రహదారుల, కస్టమ్స్ తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

ప్రస్తుతం ఎస్.ఎం.డబ్ల్యుటీసిలు 13 రాష్ట్రాలలో ఏర్పాటయ్యాయి. అవి ఆంధ్రప్రదేశ్, మిజోరం, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, పుదుచ్చేరి, రాజస్థాన్, బీహార్, అస్సాం, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్ , మహారాష్ట్ర, లక్షద్వీప్. ఈ కమిటీలను దేశంలోని 30 కోస్తా , జలమార్గ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నింటిలో ఏర్పాటు చేయనున్నారు.

ఈ సమావేశ అజెండాలో ఇప్పటికే ఏర్పడిన ఎస్.ఎం.డబ్ల్యు.టి.సిలు సాధించిన ప్రగతిని సమీక్షించడంతోపాటు, వివిధ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తారు. అలాగే సాగరమాల కార్యక్రమం అమలు, జాతీయ సముద్రయాన వారసత్వ భవన సముదాయం( ఎన్.ఎం.హెచ్.సి)ని లోథల్లో అభివృద్ధి చేయడం, ఆర్.ఒ?ఆర్.ఒ, ఆర్.ఒ? పాక్స్, ఫెర్రీ, నగర జలమార్గ రవాణా, సాగరమాల షిప్ బిల్డింగ్ క్లస్టర్లు, దేశీయ జల మార్గాలకు హరిత నౌక, కార్గో ప్రోత్సాహక పథకం, కోస్తా ప్రాంతంలో, నదులలో క్రూయిజ్ టూరిజంకు సంబంధించి అవగాహనా ఒప్పందాలు, రాష్ట్రాలలో దేశీయ జలమార్గ రవాణాను ప్రోత్సహించడం వంటి వాటిని కూడా ఈ సమావేశంలో చర్చిస్తారు.

ఎస్.ఎం. డబ్ల్యుటీసిల ఛైర్పర్సన్లుగా ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు , అదనపు ప్రధాన కార్యదర్శులు తమ తమ రాష్ట్రాలలో పురోగతిని వివరిస్తారు. ఈ సందర్భంగా వారు ఎస్.ఎం.డబ్ల్యు.టి.సి తీసుకున్న చర్యలు, ఆయా రాష్ట్రాలకు మాత్రమే ప్రత్యేకమైన అంశాలు, కేంద్ర మంత్రిత్వశాఖనుంచి అవసరమైన మద్దతు వంటి అంశాలను ప్రస్తావించనున్నారు. సముద్రయాన , జలమార్గ రవాణా రంగంలో పురోగతి, ఈ రంగం లోని సమస్యలను పరిష్కరించడం, సముద్ర మార్గ రవాణా,జల మార్గ రవాణాను దేశంలో మరింతగా ప్రోత్సహించేందుకు సమిష్టి పరిష్కారాలు కనుగొనడం వంటి వాటిపై ఈ సమావేశం దృష్&జపెడుతుంది.

# సొంత చెల్లిని గర్భవతిని చేసిన సోదరుడు

నాగర్ కర్నూల్ జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: సొంత చెల్లిని సోదరుడు గర్భవతిని చేసిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం? ఓ గ్రామంలో ఓ మహిళకు కూమారుడు, కూతురు ఉన్నారు. 13 ఏళ్ల వయసు ఉన్న తన సొంత చెల్లికి మాయ మాటలు చెప్పి కామంతో కళ్లు మూసుకొనిపోయి ఆమెను లొబరుచుకున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. అతడు తన చెల్లి తీసుకొని వనపర్తి గోపాలపట్నం మండల బుద్ధారం అటవీ ప్రాంతంలో తిరిగారు. ఖిల్లగనపురంలో ఇద్దరు నడుచుకుంటే వెళ్తుంటే స్థానికులకు అనుమానం వచ్చి 1098 ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. చైల్డ్ లైన్ అధికారులు జీరో ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు.

# హిందూ కుష్టు నివారణ సంగ్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా డాక్టర్ నిఖిల్

హైదరాబాద్ జూలై 15(ఎక్స్ ప్రెస్ న్యూస్);: హిందూ కుష్టు నివారణ సంగ్, రాజ్ భవన్ హైదరాబాదు రాష్ట్ర శాఖ యొక్క సర్వసభ్య సమావేశం (యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్) శనివారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశమునకు హిందూ కుష్టు నివారణ సంగ్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన రాష్ట్ర కమిటీ సభ్యునిగా డాక్టర్ తాడికొండ నిఖిల్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జాన్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ తాడికొండ నిఖిల్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల యొక్క సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర వహించి తన వంతు కృషి చేస్తానని, తెలంగాణ రాష్ట్రంలో కుష్టురహిత సమాజం కొరకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. నన్ను ఏకగ్రీవంగా ఎనుకున్న హిందూ కుష్టు నివారణ సంగ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# "నారీ శక్తి అవార్డు" అందుకోబోతున్న లిల్లీ మేరి

సిద్దిపేట జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో వైద్య సేవలలోను, అందరికీ వైద్య విద్యను అందించాలని తపనతో సామాజిక మాధ్యమంతో పాటు పత్రికా రంగాన్ని కూడా వేదికగా చేసుకొని అహర్నిశలు కృషి చేస్తూ అందరికీ అర్థమైన రీతిలో అక్షరాన్ని ఆయుధముగా చేసుకొని కలముతో అంటు రోగాలు, రుగ్మతలపై లిల్లీ మేరి చేసే పోరాటమును గుర్తించి "నారీ శక్తి అవార్డు" ను ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లిల్లీ మేరి కు జులై 25 వ తారీకునాడు జరగబోయే గుంపపూజోత్సవ సందర్భంగా హైదరాబాదులోని హబ్సిగూడ యందు ఈ అవార్డును ప్రధానం చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

# ట్రంప్‌పై కాల్పుల ఘటనని తీవ్రంగా ఖండించండిన ప్రధాని మోడీ

న్యూ ఢిల్లీ జూలై 14 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పుల ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. ఈ ఘటనను మోడీ తీవ్రంగా ఖండించడంతో తన ట్విట్టర్‌లో విచారం వ్యక్తం చేశారు. 'నా ఫ్రెండ్ ట్రంప్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని, త్వరగా కోలుకోవాలని' మోడీ ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యం, రాజకీయాల్లో హింసకు తావలేదని చెప్పారు. గాయపడిన ఆయన త్వరగా కోలుకొని మన ముందుకు రావాలన్నారు. అమెరికాలోని పెన్సిల్వేనియాలో యుఎస్ఎ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ర్యాలీ చేపడతుండగా ఆయనపై గుర్తు తెలియని దుండగుడు కాల్పులు జరిపాడు.

# ములుగులో ప్రప్రథమ కంటైనర్ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి సీతక్క



ములుగు జులై 15 (ఎకిస్ ప్రెస్ న్యూ స్);: మంత్రి సీతక్క ఓ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ఇదివరలో గిరిజనులకు ఏ రోగం వచ్చినా మైళ్ల దూరం వెళ్లి చికిత్స చేయించుకోవడం లేదంటే చెట్ల ఆకు పసరులు తిని బతికి బట్టకట్టడం మాత్రం చేస్తుండేవారు. కానీ ఇప్పుడు మంత్రి సీతక్క తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో కంటైనర్ హాస్పిటల్ ను అందుబాటులోకి తెచ్చారు. ములుగు జిల్లా కలెక్టర్ దినకర్ సరికొత్త ఆలోచనకు ఆమె శ్రీకారం చుట్టారు. దేశంలోనే ప్రప్రథమంగా కంటైనర్ హాస్పిటల్ ను ములుగులో అందుబాటులోకి తెచ్చారు.ప్రతి ఏటా వానా కాలంలో మన్యం ప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. గర్భిణీ మహిళలకు సకాలంలో వైద్యం అందడం దుర్భరం. పాము కాటు పడ్డ వారి పరిస్థితయితే చెప్పనవసరం లేదు. రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న మారుమూల గ్రామాల వారికి ఈ కంటైనర్ హాస్పిటల్ ద్వారా సేవలందడం హర్షణీయం. జాతీయ రహదారికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలం బంధాల గ్రామ పంచా యతీ పరిధిలోని పోచాపూర్‌లో ఈ కంటైనర్ హాస్పిటల్?ను ఏర్పాటు చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా పోచా పూర్‌లో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆసుపత్రిని మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. పోచాపూర్ గ్రామానికి చుట్టూ నర్సాపూర్, అల్లిగూడెం, బందాల, బొల్లెపల్లి గ్రామాల కు ఇక ఈ హాస్పిటల్ ద్వారా వైద్యం అందుబాటులోకి రానున్నది.నాలుగు పడకల ప్రత్యేక గది గల కంటైనర్?ను సుమారు రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఏ చిన్న పాటి జబ్బులు తలెత్తినా ఇందులో వైద్య చికిత్స అందిస్తారు. ఇందులో మందులతో పాటూ వైద్యపరీక్షలు జరిపే చిన్నపాటి ల్యాబులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ప్రసవం సమయంలో గర్భిణీలు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయనవ సరం లేకుండా ఈ కంటైనర్ హెల్త్ కేర్ యూనిట్ లోనే చికిత్స అందిస్తారు.

# పేద విద్యార్థిని చదువుకు వెస్సో ఆర్థిక సహాయం

హైదరాబాద్ జూలై 15 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) హైదరాబాద్ కర్మన్ఘాట్ జనార్దన్ రెడ్డి నగర్ లోని ఒక మురికివాడలో నివాసముండే గడ్డం రఘు(53) జీవనోపాధికై టైలరింగ్ చేస్తూ ఉంటారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెలనూ పెంచి పోషించి, చదువు చెప్పించలేక పెద్ద కూతురును పెంపకానికై బంధువులకు ఇచ్చేసారు. రెండవ కూతురు ప్రియాంక పాలిటెక్నిక్ డిప్లమాలో మంచి మార్కులతో ఉత్తీర్ణురాలై టాప్ కాలేజీలలో ఒకటైన ఎం వి ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సీటు కూడా సంపాదించింది.

కానీ ఫీజు అధికంగా ఉండి చెల్లించడం కష్టంగా భావించిన రఘు ఆర్థిక సహాయానికై వెస్సో ట్రస్ట్ ను ఆశ్రయించారు. వెస్సో ట్రస్ట్ గౌరవ దాతల సహకారంతో రఘు కు 30,100/-లు అందజేసింది. హైదరాబాద్ ఎల్బీనగర్ చింతలకుంట వాసవి కాలనీలో నెలకొని ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఒక సేవా కార్యక్రమంలో 30,100/- చెక్కును గౌరవ దాత కొచ్చెర్ల సూర్య భాస్కర రావు గారు (విశ్రాంత డిజిఎం, బిఎస్ఎన్ఎల్) మరియు వారితో పాటు గౌరవ దాత, బిల్డర్ పోలోజు రవీంద్ర చారి గారు కలిసి రఘు, ఆయన కూతురు ప్రియాంక, ఆయన భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా కొచ్చెర్ల సూర్య భాస్కర రావు గారు 5000/-ల తన సొంత చెక్కును కూడా రఘుకు ఆర్థిక సహాయంగా బహుకరించారు. ఈ కార్యక్రమానికి వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు



బంగారు తాతా రావు, తెలంగాణ వయవృద్ధుల సంఘం సెక్రటరీ వెదురుపర్తి శ్రీ మంగేష్, సిరికొండ రాజేందర్ గార్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బంగారు తాతారావు మాట్లాడుతూ పేద విద్యార్థిని ప్రియాంక ఇంజనీరింగ్ చదువుకు ఆర్థిక సహాయం చేసిన గౌరవ దాతలు అందరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

# జన్మభూమి కరీంనగర్ గడ్డ రుణం తీర్చుకుంటా: కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ జూలై 15(ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జన్మభూమి కరీంనగర్ గడ్డ రుణం తీర్చుకుంటానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్ కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి ప్రసంగించారు. కరీంనగర్‌కు నిధులు తెచ్చే బాధ్యత నాది అని, కరీంనగర్‌ను అద్దంలా తీర్చిదిద్దుతానని, కరీంనగర్ అభివృద్ధి గురించి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్‌తోనూ చర్చిస్తానన్నారు. స్మార్ట్ సిటీ మిగిలిన నిధులు త్వరలోనే కరీంనగర్ కు మంజూరు చేయిస్తానని బండి స్పష్టం చేశారు.



# ధార్మిక, కార్మిక క్షేత్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం

## -ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
## -నీటి సరఫరా పథకానికి శంకుస్థాపన

రాజన్న సిరిసిల్ల, జులై 15 :(నేటినిజం ప్రతినిధి): ధార్మిక, కార్మిక క్షేత్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం అని ప్రభుత్వ విప్ ఆది జనాభాను అంచనా వేసి 14 కోట్లతో 8 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్,పలు పనులకు వేములవాడ పట్టణ త్రాగునీటి సమస్య పరిష్కారానికి



శ్రీనివాస్ అన్నారు. అమృత్ 2.0 లో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 15 వ వార్డులోని బాలానగర్లో రూ. 14 కోట్ల నిధులతో వేములవాడ పట్టణ త్రాగునీటి సమస్య పరిష్కారానికి పెరుగుతున్న పట్టణ పెరుగుతున్న పట్టణ జనాభాను అంచనా వేసి 14 కోట్లతో 8 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్, పలు పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, మున్సిపల్ ఛైర్పర్సన్ మాధవి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రజలకు త్రాగు నీటికి ఇబ్బంది తలెత్త కుండ ఉండేందుకు ఎన్ని నిధులైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నమాన్నారు.

కనీస అవసరాలు అయిన సాగు,త్రాగు నీరు,విద్యా వైద్య అందించడం ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

శ్రీపాద ఎల్లం పల్లి ప్రాజెక్ట్ ద్వారా 2005 లో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 1731 కోట్ల తో ప్రాజెక్టు కు నిధులు విడుదల చేసారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో కలసి పలు రిజర్వాలను సందర్శించడం జరుగుతుందన్నారు.

మన ప్రాంతానికి సాగునీరు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

కలెక్టర్ నేతృత్వంలోని అధికార యంత్రాంగం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, మన ప్రాంత సమస్యలు పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరుగుతున్న మీటింగ్ లో ముంపు గ్రామాల సమస్యలు,నేతన్నల సమస్యలు తదితరులు అంశాలపై ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పిస్తారన్నారు.

# పంటల రుణమాఫీ మార్గదర్శకాలపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైర్

హైదరాబాద్, జులై 15: : హైదరాబాద్ : పంటల రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫైర్ అయ్యారు. అవి మార్గదర్శకాలు కావు.. మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం కోసం వ్యవసాయ సుస్థిరత కోసం కేసీఆర్ 2 విడుతల రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. మొదటి విడుతలో 35.31 లక్షల మంది రైతులకు రూ. 16,144.10 కోట్లు రుణమాఫీ చేశారు. రెండో విడుతలో 22 లక్షల 98 వేల 39 రైతులకు రూ. 13,000.51 కోట్లు రుణమాఫీ చేశారు. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసింది.

తాము అధికారంలోకి వస్తే ఇలా ఎన్నికలు అయిపోగానే అలా డిసెంబరు 9న రుణమాఫీ చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఉన్న 69 లక్షలపై చిలుకు ఉన్న తెలంగాణ రైతాంగంలో ఆశలు రేపింది. అందరి రుణాలను మాఫీ చేస్తామని ఆ రోజు బహిరంగంగా చెప్పారు. ఈ రోజు కొందరికే పరిమితం చేసేందుకు మార్గదర్శకాలు తీసుకువచ్చారు. ఈ రోజుల్లో 5 ఎకరాల వ్యవసాయదారుడు, రూ. 30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడు. రేషన్ కార్డు, పీఎం డాటా వంటి తోకా తొండాలు పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేస్తున్నారు. రుణమాఫీ చేశాం అన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు తప్ప .. రైతాంగం బాగుండాలి .. వ్యవసాయం బాగుండాలి అన్న సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు.

# ఘనంగా అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమలు



రాజన్న సిరిసిల్ల, జులై 15 :(నేటినిజం ప్రతినిధి): రెండున్నర సం" నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలి అంగన్వాడి సూపర్వైజర్ కనకమ్మ తెలిపారు. వేములవాడ పట్టణంలో సోమవారం అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమాన్ని సిడిపిఓ ఎల్లయ్య ఆధ్వర్యంలో మహాలక్ష్మి వీధిలో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ మారం కుమార్ సూపర్వైజర్ కనకమ్మ పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కనకమ్మ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల్లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కేంద్రానికి వచ్చే పిల్లలకు కొత్త సెల్ బస్ ప్రకారం ఫ్రీ స్కూల్ విద్యను అందించడం జరుగుతుందన్నారు. పిల్లలకు పోస్టకాహారాన్ని అందించడమే కాకుండా వారి ఆరోగ్య పట్ల తగిన శ్రద్ధను తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఎప్పటికప్పుడు పిల్లల ఎత్తు బరువును కొలుస్తూ వారి పోషణ స్థాయిని అంచనా వేసి తల్లిదండ్రులు తగిన సూచనలు సలహాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శోభ సరస్వతి సరోజన మునెమ్మ శ్రీవాణి జ్యోతి వెూక్షారాణి పాల్గొన్నారు. అలాగే వేములవాడ అర్బన్ రూరల్ గ్రామాలలో మారూపాక తెట్టేకుంట చంద్రగిరి అనుపురం నాంపల్లి రుద్రవరం చింతలటన చిర్లవంచ మల్లారం హన్మాజిపేట బొల్లారం గ్రామాలలో అమ్మమాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం లో ఐసీడీఎస్ సుప్రవైజర్ నిర్మల అంగన్వాడి టీచర్లు వజ్రామ్మ స్వరూప పద్మ మల్లీశ్వరి ఉజ్వల విమల విజయ అనిత శ్యామల ఉమా స్వరూప అమృత భారతి శాత్రాజుపల్లి అంగన్వాడి టీచర్లు జ్యోతి లక్ష్మినరసమ్మ అరుణ గ్రామపంచాయతీ కార్యదర్శి హై స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# 30 ఏళ్ళయినా తమ ప్రాంతానికి పేరు, గుర్తింపు, చిరునామా లేదు ...

## -అలుగునూరుకు అనుబంధంగా ఉన్న తమ ఆరు కాలనీలను అధికారికంగాగుర్తించండి..
## -అలుగునూర్– 2 కింద తమ ప్రాంతాన్ని గుర్తించేలా చర్యలు చేపట్టండి...
## -ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు చిందం నరసయ్య, బొంతల కళ్యాణ్ చంద్ర...



కరీంనగర్, జులై 15 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ కు అనుబంధ ఉన్న తమ ప్రాంతానికి 30 ఏళ్లుగా ఏలాంటి అధికారిక పేరు, గుర్తింపు, చిరునామా లేకపోవడంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ , నష్ట పోతున్నారని ఇక్కడి ప్రాంతాన్ని అలుగునూరు 2 గా గుర్తించి ఇక్కడి ఆరు కాలనీలు శ్రీ వెంకటేశ్వర కాలనీ, హుస్సేన్ నగర్, క్రిస్టియన్ కాలనీ, వినాయక నగర్, తమిళ కాలనీ, చేపల కాలనీలను అధికారికంగా గుర్తించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం జరిగిన ప్రజావాణిలో శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిందం నరసయ్య, బొంతల కళ్యాణ్ చంద్ర ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు సమస్యను విన్నవించారు. అనంతరం, నగరపాలక సంస్థ కమిషనర్ మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ లకు సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు లో పేర్కొన్న అంశాలను కాలనీ బాధ్యులు చిందం నరసయ్య , బొంతల కళ్యాణ్ చంద్ర వివరించారు. ప్రధానంగా అల్గునూరుకు సుమారుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఎల్ఎండి కాలనీ పక్కన, కరీంనగర్ హైదరాబాద్ రాజీవ్ రహదారి కి పక్కన దాదాపు 30 సంవత్సరాల క్రితం అప్పటి అలుగునూర్ గ్రామపంచాయతీకి అనుబంధంగా ఆరు కాలనీలు ఏర్పడ్డాయనీ తెలిపారు. ఇక్కడి ప్రాంతం ఏర్పాటు జరిగిన సమయంలో ఆదర్శనగర్, కాకతీయ కాలనీ, లేబర్ కాలనీ లాంటి తాత్కాలిక పేర్లు పెట్టారే తప్ప అధికారికంగా ఇక్కడి ప్రాంత పేరును గుర్తింపును అమల్లోకి తీసుకురాలేదన్నారు. అలుగునూరు గ్రామపంచాయతీకి అనుబంధంగా హేబిటేషన్ విలేజ్ కింద ఇక్కడి ప్రాంతాన్ని గుర్తించకపోవడంతో గతంలో తమ ప్రాంతం గ్రామపంచాయతీ అయ్యే అవకాశాన్ని కోల్పోయిందని, దీంతో ప్రజలంతా నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దాదాపు 1500 పై చిలుకు జనాభా కలిగి ఆరు కాలనీలుగా ఏర్పడ్డ ఈ ప్రాంతాన్ని కలిపి లోగడ మానేరు నగర్ పేరుతో గుర్తించాలని తామంతా కోరితే అలుగునూరు గ్రామపంచాయతీ తీర్మానం చేసిన నేటికీ అ పేరు కూడా అమల్లోకి రాలేదన్నారు. లోగడ ఇక్కడ జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో కాకతీయ కాలనీ , చేపల కాలనీ, అలుగునూరు పేరిట శిలాఫలకాలు ఏర్పాటు చేశారే తప్ప అధికారికంగా ఇక్కడి ప్రాంతాన్ని గుర్తింపు కోసం నేటికీ ఏలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీంతో ఇక్కడి ప్రాంతం పేరులేని , గుర్తింపు చిరునామాలేనిఏరియాగా దాదాపు 30 ఏళ్లుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందనీ, . ప్రధానంగా అలుగునూరు లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మా ప్రాంతానికి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. అధికారికంగా ఇక్కడిప్రాంతానికి పేరు , గుర్తింపు, చిరునామా లేని కారణంగా ఇక్కడి ఆరు కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. 30 సంవత్సరాలుగా కనీస చిరునామా గుర్తింపు లేకుండా పోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు పలు విలువైన పత్రాలు, ఆధార్, ఓటర్ కార్డు విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పరిస్థితులుతలెత్తుతున్నాయన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల ఇంటి నెంబర్ల మార్పు ప్రక్రియ చేపడుతున్న దృశ్య అలుగునూర్ కు అనుబంధంగా ఉన్న ఇక్కడి ప్రాంతంలోని ఆరు కాలనీలను అలుగునూర్ 2 పరిధిలోకి తీసుకువచ్చి , ఇక్కడి కాలనీలను అధికారికంగా గుర్తించడానికి తగిన చర్యలు చేపట్టి ప్రజలందరికీ న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

# బిజెపి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ దాతృత్వం... నేపాల్ పిల్లల చదువుల కోసం చేయూత...



కరీంనగర్, జులై 15 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగర పాలక సంస్థ ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ నేపాల్ కు చెందిన నిరుపేద విద్యార్థుల చదువుల కోసం చేయూతనందించారు. నేపాల్ కు చెందిన సంతోష్ కళావతి అనే దంపతులు బతుకు తెరువు కోసం కరీంనగర్ కు వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో పనిచేస్తూ జీవన ఉపాధి కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఆసీస్ (10), కార్తీక్ ( 8), ఒక కుమార్తె సాన్విక (6) ఉన్నారు. పిల్లలను చదివించలేని నిరుపేద పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్న విషయాన్ని కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తీగలగుట్టపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చేర్పించారు. పిల్లలకు అవసరమైన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ ఇతర సామాగ్రిని కార్పొరేటర్ శ్రీనివాస్ అందించారు. పిల్లల తల్లిదండ్రులు ఈ సందర్భంగా కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఖమ్మంలో జోస్ అలుక్కాస్ సరికొత్త షోరూమ్ ప్రారంభం

## – షోరూం ప్రారంభించిన మంత్రి తుమ్మల



ఖమ్మం, జులై 15 :(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ జోన్ ఆలుక్కాస్ తమ సరికొత్త జ్యువెల్లరీ షోరూంను ఖమ్మం నగరంలోని వైరా రోడ్డు నందు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో సెలబ్రిటీ గెస్ట్ సినీనటి సంయుక్త మేనన్ పాల్గొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆయిక్కొ, పాల్ జె అలుక్కా, జోస్ అలుక్కా ఈ వేడుకకు హాజరయ్యారు. ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్ కనీసం రూ.60,000 విలువైన బంగారు ఆభరణాలు వజ్రాలు కొనుగోలు చేసిన వినియోగదారులు ప్రోత్సాహకంగా ఒక బంగారు నాణేన్ని అందుకునే ఈ అవకాశం జూలై 14వరకు లభ్యమవుతుంది. వినియోగదారులు వజ్రాలపై 20శాతం తగ్గింపును, ప్లాటినం ఆభరణాలపై 7శాతం తగ్గింపును పొందవచ్చు. అదనంగా వివాహ వేడుకల కోసం చేసే కొనుగోళ్ళపై ఆకర్షణీయమైన తగ్గింపులు ఉంటాయి. అంతేకాదు, ప్రతి కొనుగోలుతో ఒక ఉచిత బహుమతి లభిస్తుంది. వినియోగదారులు తమ పాత బంగారాన్ని హెచ్ యుఐడి హాల్మార్క్ కలిగిన కొత్త బంగారు ఆభరణాలతో ఎక్స్చేంజ్ చేసుకోవాలని వాటితో లభించే లాభాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ సరికొత్త షోరూమ్ లో వైవిధ్యభరితమైన, ఆకర్షణీయమైన బంగారు ఆభరణాలు, వజ్రాలు, ప్లాటినం, వెండి కలెక్షన్ల అద్భుతమైన డిజైన్లు కొలువు తీరింది అని ఛైర్మన్ జోస్ అల తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీరజ, సాదు రమేష్ రెడ్డి, కమర్తపు మురళి, తుపాకుల ఏలగోండ స్వామి, మలీదు జగన్, ఖాదర్ బాబా, తాత రఘురాం, సింగు రాజయ్య, షోరూం యాజమాన్యం, సిబ్బంది, తదితర నాయకులు పాల్గొన్నారు.

# కర్నూలు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బిందు మాధవ్

అమరావతి, జులై 15 :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో కర్నూలు జిల్లా ఎస్పీగా పనిచేసిన జి.కృష్ణకాంత్ నెల్లూరు జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. ఇక ఆయన స్థానంలో గరికపాటి బిందుమాధవ్ కర్నూలు జిల్లా ఎస్పీగా సోమవారం జల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మీడియాతో మాట్లాడారు. కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర డీజీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లకర్నూలు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని? మహిళల భద్రత, మహిళలపై నేరాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెడతామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సహకారం, సమన్వయంతో కలిసి పని చేస్తామన్నారు.

# ఘనంగా ఆల్ఫోర్స్ బోనాల ఉత్సవం

## -సాంస్కృతిక వేషాధరణలతో ఆకర్షింపజేసిన విద్యార్థులు




కరీంనగర్, జులై 15 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో ఆషాడమాసం సందర్భంగా అల్ఫోర్స్ బోనాలు ఉత్సవ్ కార్యక్రమాన్నీ సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి నరేందర్ రెడ్డి హాజరై, జోతి ప్రజ్వలన చేసి శ్రీ నవదుర్గా చిత్రపటానికి పూల మాల వేసి ఉత్సవాలను రెట్టింపు ఉత్సాహంతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో బోనానికి ప్రత్యేకమైన స్థానం ఉన్నదని, అన్ని మతాల వారు అన్ని కులాల వారు బోనాలను అట్టహాసంగా నిర్వహిస్తు తెలంగాణ రాష్ట్రానికే ప్రతికా ఉన్నదని తెలుపుతూ మత సామరస్యాన్ని కాపడడంలో సైతం చాలా కీకలంగా వ్యవహరిస్తుందని చెప్పారు. బోనాల ఉత్సవాలు కేవలం పల్లెల్లోనే కాకుండా విదేశాల్లో సైతం విదేశాల్లో సైతం ఉత్సాహంతో వేడుకగా నిర్వహిస్తూ సకల శక్తులను ప్రసాదించే గొప్ప ప్రక్రియా అని గుర్తు చేశారు.

ఆషాఢ మాసం రాగానే బోనాలను ప్రత్యేకంగా ఉత్సవంలా నిర్వహిస్తారని రాష్ట్ర రాజధాని అయిన హైద్రాబాద్ లో ఉజ్జేయని మహంకాలి మాతకు బోనం సమర్పించి బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా సపరివార సమేతంగా అందరు పాల్గొని వనదేవతల యొక్క ఆశీస్సుల ను పొందుతారని చెప్పారు. పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా రెట్టింపు ఉత్సాహంతో ఆకాశమే హద్దుగా నిర్వహించడం జరుగుతున్నదని ప్రత్యేకంగా ఈ ఉత్సవాలను ప్రకృతి సరిగ్గా ఉండాలని, వర్షాలు సకాలంలో కురువాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వహిస్తారని తెలిపారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి "అంభా భవాని అంభే భవాని" "తెలంగాణం సమర్పించింది ఒక బంగారు బోనం" జాతరో జాతర బాల్కంపేట ఎల్లమ జాతర నృత్యాలు చాలా ఆకర్షించింపజేశాయి. సుమారు 120 మంది విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి బోనాలను ఎత్తుకొని పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ప్రత్యేకంగా 50 మంది పోతురాజుల వేశధారణలో విచ్చేసిన చిన్నారులు చేసిన విన్యాసాలు చాలా అబ్బురపరచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్ఐఐటి ఫౌండేషన్ మరియు ఏంజెల్ వన్ స్కిల్ మెంట్ కార్యక్రమం ద్వారా బీద వర్గాలకు చెందిన 3,750 మంది యువతకు సాధికారత

హైదరాబాద్, జులై 15: :యువత తాము కోరుకున్న ఉద్యోగాలను కనుగొనడంలో నిరంతర సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు. బిజినెస్ ప్రాసెస్ అవుట్సోర్సింగ్ (బిపిఓ) మరియు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ మరియు ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) వంటి ముఖ్యమైన పరిశ్రమల పెరుగుదల ఉన్నప్పటికీ, దేశంలోని చాలా మంది తాము కోరుకున్న ఉద్యోగాలను సాధించడానికి కష్టపడుతున్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన తాజా ఇండియా ఎంప్లాయ్మెంట్ రిపోర్ట్ 2024 వెల్లడించిన దాని ప్రకారం , ఉద్యోగార్థులు ఉద్యోగాలను కనుగొనడంలో అతిపెద్ద అవరోధాలుగా వారి విద్య, నైపుణ్యాలు లేదా అనుభవానికి సరిపోయే ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడమే (35%). అదే సమయంలో, తగిన కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేకపోవడాన్ని కూడా నివేదిక హైలైట్ చేసింది. నైపుణ్య అంతరాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని గుర్తించి, ఏంజెల్ వన్ సహకారంతో ఎన్ఐఐటీ ఫౌండేషన్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేలా శిక్షణను అందించాలనే ఉద్దేశంతో ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రారంభించింది. 2022లో ప్రారంభించబడిన ఈ సహకార కార్యక్రమం బిఎఫ్ఎస్ఐ మరియు బిపిఓ విభాగాలపై దృష్టి సారించిన 18 మరియు 28 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్థు లకు ఉచితంగా ఆన్లైన్ కోర్సులను అందిస్తుంది. ఈ కోర్సుకు పురుషులతో పోలిస్తే 58% మంది మహిళలు వీటికి నమోదు చేసుకున్నారు. అదే సమయంలో, మొత్తం అభ్యర్థులలో 71% మంది (3,474 మంది లబ్ధిదారులు) సుప్రసిద్ధ సంస్థల్లో విజయవంతంగా ప్లేస్మెంట్ పొందారు. ఎన్ఐఐటీ ఫౌండేషన్ యొక్క సీఈఓ, సపన్ మౌద్గిల్ మాట్లాడుతూ "కమ్యూనికేషన్ మరియు విశ్లేషణాత్మక నైపుణ్యాల వంటి సాఫ్ట్ స్కిల్స్ను అభివృద్ధి చేయడంలో సహాయపడే విభిన్న కోర్సుల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దడం ఎన్ఐఐటీ ఫౌండేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. సమగ్ర శిక్షణా కార్యక్రమాల ద్వారా, ఉద్యోగ నియామకాల కు వారిని సిద్ధం చేయడంతో వారు విజయం సాధించారు. పరిశ్రమ డిమాండ్లు మరియు యువత నైపుణ్యాల మధ్య అంతరాన్ని తగ్గించడం మేము లక్ష్యంగా పెట్టుకున్నాము" అని అన్నారు. "నేటి యువతలో అధిక భాగం కు ఆధునిక జాబ్ మార్కెట్కు అవసరమైన నైపుణ్యాలు లేవనేది అంగీకరించ వలసిన వాస్తవం. ఈ సమస్య బీద వర్గాలలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. అందువల్ల, అటువంటి యువకులకు సాధికారత కల్పించడానికి ఎన్ఐఐటీ ఫౌండేషన్తో చేసుకున్న ఈ భాగస్వామ్యం విజయం చాలా సంతోషకరమైనది. మరింత ప్రభావాన్ని సృష్టించే దిశగా మా భాగస్వామ్యాన్ని కొనసాగించడానికి మేము ఎదురుచూస్తున్నాము, "అని ఏంజెల్ వన్ యొక్క హెడ్ సీఎస్ఆర్ షెఫాలీ హసిజా అన్నారు.

# శ్రీశైలం అన్న ప్రసాద వితరణకు హైదరాబాద్ వాసుల రూ.13.90 లక్షల విరాళం..!

హైదరాబాద్, జులై 15: :హైదరాబాద్ నగరంలోని మల్కాజిగిరి వాసి స్వయంపాకుల లక్ష్మీ నారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీశైలంలో అన్న ప్రసాద వితరణకు రూ.13.90 లక్షల విరాళాన్ని అందజేశారు.

శ్రీశైలం దేవస్థానం సహాయ కార్య నిర్వహణాధికారి జీ స్వాములు, పర్యవేక్షకులు పీ హిమబిందుకులకు ఈ విరాళాన్ని అందజేశారు.

స్వయం పాకుల ఉదయ్ భాస్కర్ ? శ్యామల పేరుతో రూ.10 లక్షలు, పరిమిణి కృష్ణమూర్తి–ఇందిరాదేవి పేరుతో రూ.లక్ష, స్వయంపాకుల లక్ష్మీ శ్యామల పేరుతో రూ.లక్ష, స్వయంపాకుల లక్ష్మి నైరా పేరుతో రూ.లక్ష చొప్పున అన్న ప్రసాద వితరణకు అందజేశారు. పరిమి సుశీలా దేవి పేరుతో రూ.25 వేలు, స్వయంపాకుల లక్ష్మీ నారాయణ ? పరిమి సుశీలాదేవి పేరుతో రూ.55 వేలు, స్వయంపాకుల రాజ్య లక్ష్మి పేరుతో రూ.10 వేలు విరాళం అందజేశారు.

వీరికి శ్రీశైలం అధికారులు భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలు అందజేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.